
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ముంచేశాయి..



పత్తిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాలు నిలువునా ముంచేశాయి. చేతికొచ్చిన పత్తి దిగుబడి చెట్టు పైనే నేల రాలిపోయింది. జిల్లాలో సగటు దిగుబడి ఎనిమిది క్వింటాళ్లు వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తల అంచనా. మూడు నాలుగు క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితి. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు పైగా దిగుబడి కోల్పోయారు. ఈలెక్కన దిగుబడి రూపంలో పత్తి రైతులు రూ.2,250కోట్లకు పైగా నష్టాన్ని మూటగట్టుకోవాల్సి వస్తుంది. ధర లేక ఉల్లి రైతులు చితికిపోతే ప్రభుత్వం అండగా నిలిచింది. అదే తరహాలో పత్తి రైతులకు కూడా అండగా నిలవాలని వ్యవసాయ నిపుణులు కోరుతున్నారు. తాజాగా పత్తి రైతుల మెడపై అల్పపీడనం కత్తి వేలాడుతోంది. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- అల్పపీడనం ప్రభావంతో అధిక వర్షాలు
- నేల పాలవుతున్న తెల్ల బంగారం
- ఎకరాకు సగటు దిగుబడి అంచనా 8 క్వింటాళ్లు
- మూడు, నాలుగు క్వింటాళ్లు కూడా చేతికందని వైనం
- ఎకరాకు ఐదు క్వింటాళ్లకు పైగా నష్టపోయిన అన్నదాతలు

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తి సాగులో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో 4.02 లక్షల హెక్టార్ల (10.05 లక్షల ఎకరాలు)లో పత్తి సాగు చేశారని ప్రభుత్వం అంచనా వేసింది. జిల్లాలో ఒక్కటే 2.24లక్షల హెక్టార్లు (5.6లక్షల ఎకరాలు) సాగు చేశారు. వర్షాధారం కింద ఎకరాకు సగటున రూ.45-50 వేలు పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు. సేద్యం ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కలుపులు ఇలా వివిధ రూపాల్లో రూ.2,500కోట్లకు పైగా మట్టిపోశారు. మొలకెత్తి పత్తి పచ్చగా ఏపుగా పెరుగుతుంటే కష్టాలు తీరుతాయని సంబరపడ్డారు. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు నిలువునా ముంచెత్తాయి. రైతులు ఊహించని తీవ్ర నష్టం చవిచూశారు. ఏ రైతును కదిపినా కన్నీటి కష్టాలు ఏకరువు పెడుతున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తెలంగాణ రాష్ట్రానికి వలస కట్టారు.





వర్షాలకు తడిసి చెట్టు పైనే మొలకలు వస్తున్న పత్తి

గతేడాదితో పోలిస్తే..

జిల్లాలో గతేడాది ఎకరాకు సగటున 11 క్వింటాళ్లు దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈఏడాది సగటున ఎనిమిది క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. భారీ వర్షాలతో చెట్టుపై పత్తి చేతికి రాకుండానే నేలపాలైంది. ఎకరాకు సగటున మూడు నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపినట్లు సమాచారం. గతేడాదితో పోలిస్తే ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లు చొప్పున 5.60 లక్షల ఎకరాలకు 25 లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడి కోల్పోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మద్దతు ధర రూ.8,110 ప్రకారం లెక్కిస్తే సుమారుగా రెండు వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పత్తి దిగుబడులు రైతులు కోల్పోవాల్సి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త ఒకరు పేర్కొన్నారు.

మిగతా 7వ పేజీలో



ఆదోని మండలం మదిరె గ్రామంలో పత్తి పంటను పరిశీలిస్తున్న నంద్యాల ఆర్ఏఆర్ఎస్, బనవాసి కేవీకే శాస్త్రవేత్తలు (ఫైల్)

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు 1వ స్థాయీ సంఘ సమావేశం ఉంటుందని, అనంతరం జిల్లా పరిషత్ సమావేశభవనంలో 11 గంటలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసనసభ్యులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, మత్స్యశాఖ, దేవదాయ శాఖలపై చర్చ ఉంటుందని వివరించారు. ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్

- 27 నుంచి మద్దతు ధరతో సీసీఐ కొనుగోలు
- మార్కెట్ యార్డ్ సెక్రెటరీ గోవిందు



సీసీఐ ప్రతినిధులతో పత్తి కొనుగోళ్లపై చర్చిస్తున్న సెక్రటరీ గోవిందు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కు పత్తి విక్రయించుకోవాలంటే రైతులు ముందుగానే తమ పేర్లు, స్లాట్ బుక్ చేసుకోవాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో సీసీఐ ప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. మార్కెట్‌లో పత్తి ధరలు పతనం కావడంతో రైతులు సీసీఐకి విక్రయించుకునేందుకు ఎక్కువ యాప్‌ను తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సీఎం యాప్‌లో గ్రామాల్లోని ఆర్ఎస్‌కేలతో తమ పేర్లను నమోదు చేసుకుంటే విక్రయించుకునే తేదీ, కొనుగోలు పరిశ్రమ ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తుందన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని సీసీఐ ప్రతినిధి శ్రీనివాసులు తెలిపారు. రైతులు తొందరపడి తక్కువ ధరకు బయటి వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రణాళికాబద్ధంగా, ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఈ- క్రాప్ బుకింగ్ తప్పకుండా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి శాంతకుమార్ సూపర్‌వైజర్లు మోహన్ రెడ్డి, రామాంజినేయులు పాల్గొన్నారు.

వద్దంటే వాన

- ఖరీఫ్ సాగుకు నష్టం
- పంట దిగుబడులు చేతికి రావని రైతుల విచారం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విరామం లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. జూన్‌లో మొదలైన వానలు ఖరీఫ్ సీజన్ ముగిశాక సెప్టెంబరు నెలాఖరుకు తగ్గుముఖం పడుతాయని వ్యవసాయ శాఖ అధికారులు భావించారు. అయితే.. ఖరీఫ్ సీజన్‌లో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వానలు తక్కువగా కురుస్తాయనే అంచనా తారుమారైంది. ఖరీఫ్ పంటలు రైతుల చేతికి అందే సమయంలో వదిలిపెట్టకుండా వానలు కురుస్తుండటంతో నష్టపోతామని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకోవడానికి వారు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. గురువారం కర్నూలు జిల్లాలో కురిసిన వర్షాలకు రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అంతకుముందు వారం రోజులుగా మబ్బులు మాత్రమే ఉండి ఎండ కాయలేదు. ఉల్లిగడ్డలు, వేరుశనగ, టమోటా మొక్కజొన్న, పత్తి తదితర పంటలను పొలాల్లో కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. గురువారం ఓర్వకల్లు మండలంలో 18.2ఎంఎం, గూడూరులో 17, కల్లూరులో 14.4, చిప్పగిరిలో 10.6, మద్దికెరలో 9.8, సి.బెళగల్‌లో 9, కోడుమూరులో 8.8, వెల్దుర్తిలో 6.6, కర్నూలు రూరల్‌లో 6.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 1 ఎంఎం నుంచి 5 ఎంఎం దాకా వర్షపాతం నమోదైంది. అక్టోబరు నెలాఖరుకు 43.4 ఎంఎం కురవాల్సి ఉండగా.. గురువారం ఒక్కరోజే 34.7 ఎంఎం వర్షం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లోని జూన్‌లో 77.7 ఎంఎం వర్షంకు గాను 74.3 ఎంఎం నమోదైంది. జూలై నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు రోజూ వర్షాలు పడుతూనే ఉన్నాయి. జూలైలో 90.7 ఎంఎం, 76.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. ఆగస్టులో 116.2 ఎంఎం కురవాల్సి ఉండగా రెండింతలు 208.9 ఎంఎం నమోదైంది. సెప్టెంబరులో 116.5 ఎంఎం గానూ 225.8 ఎంఎం రెట్టింపు వర్షం నమోదైంది. ఈ వర్షాలు ఇంకెప్పుడు విరామం ఇస్తాయో.. తమ పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు అవకాశం ఎప్పుడు వస్తుందో రాదోనని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండ్రపాడు జిల్లా విద్యా శిక్షణా సంస్థల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల స్థానాల్లో ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ ప్రాతిపదికన పని చేయడానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హత గల ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ అయూబ్ హుశేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ, సోషియాలజీలో ఒకటి, తెలుగులో ఒకటి, ఫిన్ ఆర్ట్స్‌లో రెండు పోస్టులు కలిపి మొత్తం 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉమ్మడి కలెక్టర్ ఛైర్మన్, డీఈవో కన్వీనర్‌గా, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సభ్యులుగా కమిటీ ఎంపిక చేస్తుందన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో 23 అక్టోబరు నుంచి 29వ తేదీలలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. నోటిఫికేషన్ ప్రకటనలో ఇచ్చిన క్యూఆర్ కోడ్ ద్వారా గూగుల్ ఫారంను ఆన్‌లైన్‌లో సమర్పించి దానికి సంబంధించిన కాపీని డౌన్‌లోడు చేసుకుని వారు పని చేస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా హార్డ్ కాపీని డైట్ ప్రిన్సిపాల్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అక్టోబరు 30, 31 తేదీల్లో దరఖాస్తులను పరిశీలిస్తారన్నారు. నవంబరు 5 నుంచి 8వ తేదీ వరకు రాత పరీక్ష ఉంటుందన్నారు. నవంబరు 13న ఫలితాలు వెల్లడవుతాయన్నారు. 14, 15 తేదీలలో మౌఖిక పరీక్ష ఉంటుందని తెలిపారు. 18న ఎంపికైన ఉపాధ్యాయులకు ఆర్డర్ కాపీలు అందిజేస్తామని తెలిపారు. వివరాలకు డైట్ కార్యాలయంలోని స్టాఫ్ ఉదయ్ 7663913634ను సంప్రదించాలన్నారు.



హంద్రీకి జీడీపీ నీరు

- ఎల్లెల్సీ నుంచి జీడీపీకి 190 క్యూసెక్కులు
- 4వ గేటు ఎత్తి 335 క్యూసెక్కులు విడుదల



జీడీపీ నాలుగో గేటు ఎత్తి నీరు విడుదల చేసిన దృశ్యం

గోనెగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీనదికి బుధవారం రాత్రి ఇరిగేషన్ అధికారులు నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి 335 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా జీడీపీకి హంద్రీ నుంచి 80 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అలాగే బుధవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షం కురియడంతో గురువారం మధ్యాహ్నం వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే గోనెగండ్ల తుంగభద్ర దిగువ కాలువ ఎస్కేప్ చానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్ట్‌లోకి 190 క్యూసెక్కుల నీటిని ఎల్లెల్సీ ఇరిగేషన్ అధికారుల విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం నీటి మట్టం(4 టీఎంసీ) 376.70 మీటర్లు ఉంది. జీడీపీ పూర్తి స్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.30 మీటర్లు మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో జీడీపీ ఆయకట్టు రైతులుకు నీటి ఇబ్బంది ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంకెన్నాళ్లో..!

- ప్రభుత్వ క్వార్టర్స్ ఖాళీ అయ్యేనా..?
- ముగిసిన గడువు
- కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో?
- ఎదురుచూస్తున్న ఉద్యోగులు



కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్స్‌లోని ఆక్రమణదారుల పాగా కొనసాగుతోంది. క్వార్టర్స్ ఖాళీ అవుతాయో.. లేదోనని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. అక్రమార్కులు ఖాళీ చేసేందుకు జిల్లా యంత్రాంగం ఇచ్చిన గడువు గురువారంతో ముగిసింది. గత కలెక్టర్ ఆదేశాలు అమలవుతాయా.. లేక కొత్త కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై ప్రస్తుతం చర్చ సాగుతోంది. దాదాపు 90ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఉన్న 965 ప్రభుత్వోద్యోగుల కోసం నిర్మించిన నివాసాలు కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. మరి కొన్నింట్లో ఆక్రమణదారులు పాగా వేశారు. ఈ విషయంపై కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై ప్రభుత్వం కూడా నగరంలోని ప్రధాన కాలనీగా కోట్ల విలువ చేసే స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టినట్లు ఆదేశించినట్లు సమాచారం. ఈ ప్రక్రియ ప్రారంభమయ్యాక ఉద్యోగులు, ఆక్రమణదారుల మధ్య వాగ్వాదం చేసుకున్న విషయం తెలిసిందే. ఆందోళనల నేపథ్యంలో ఆర్డీవో అక్టోబరు 23 వరకు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని అక్రమణ దారులకు మరో సారి గడువు ఇచ్చారు. ఈ క్రమంలో అప్పటి కలెక్టర్ బదిలీ కావడం, జిల్లా ప్రధాని పర్యటన నేపథ్యంలో విషయం అటకెక్కింది. జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ ఏచర్య తీసుకుంటారోననే ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఇదే విషయం ఆర్అండ్ బీ ఈఈ సునీల్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా ఖాళీ అయిన క్వార్టర్స్‌లో కొత్తగా ఉద్యోగులకు అలాట్ చేస్తున్నామని, తదుపరి చర్యలు కలెక్టర్ నుంచి వచ్చే ఆదేశాలపై ఆధారపడి ఉంటుందన్నారు.



పెళ్లి పేరిట మోసం
• గర్భందాల్చి.. ప్రసవించిన బాలిక
7
తాగునీటి సమస్య రాకుండా చూడాలి
• సుంకేసుల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్



బీటలువారిన జీడీపీ మట్టి కట్ట

- వర్షం వల్ల రోడ్డు మీదికి కొట్టుకొస్తున్న మట్టి
- నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు
- కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చిన జీడీపీ అధికారులు



క్రస్ట్‌గేట్ల దగ్గర భారీగా కోతకు గురైన జీడీపీ మట్టి కట్ట

గోనెగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టులో కొత్తగా నిర్మించిన మట్టి కట్ట గత నెలలో కురిసిన వర్షాలకు కోతకు గురై కొంత కుంగిపోయింది, కొంత కొట్టుకుపోయింది. ఈ మట్టి.. రోడ్డుకు అడ్డంగా చేరుతుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కట్ట కోతకు గురై మాసాలు గడుస్తున్నా చర్యలు మాత్రమ శూన్యం. ఇటీవల ఎమ్మిగ నూరుకు చెందిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మట్టి కట్ట పక్కనే ఉన్న క్రస్ట్‌గేట్ల దగ్గర నీళ్లలో జారిపడి మృతిచెందారు. వారం రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు మట్టి కట్ట ఎక్కుతూ జారి కింద పడ్డారు. వారికి ఏ ప్రమాదం జరగలేదు. ఇలా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మట్టి కట్ట నిర్మాణంలో పనుల నాణ్యతపై ప్రజలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి ప్రాజెక్టు నుంచి పిల్లిగుండ్ల సమీపం వరకు చాలా చోట్ల మట్టికట్ట పగుళ్లు వచ్చాయి. నాణ్యత లేని పనులతో ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు, ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 4టీఎంసీల నీరు ఉంది. అనుకోని ప్రమాదాలు ఏమైనా జరిగే ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించకపోతే ఇరిగేషన్ అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కట్ట నిర్మాణంలో గ్రౌండ్ లెవెల్‌లో 8 నుంచి 18 మీటర్లు, టాప్ లెవెల్‌లో 6 మీటర్ల వెడల్పు, 4.313 కిమీ పొడవున మట్టి కట్ట నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. కోతకు గురైన ప్రాంతంలో మరోసారి నాణ్యంగా పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో వైసీపీ నాయకులు, అధికారులు పనుల్లో కమీషన్ కోసం చేయి చాచడం కారణంగానే నాణ్యత లోపించిందనే ఆరోపణలు ఉన్నాయి. చాలాచోట్ల మట్టి కట్ట కోతకు గురైంది. ఇప్పటికైనా జీడీపీ ఇరిగేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని పగుళ్లు బారిన చోట నూతనంగా పనులు చేయించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసులు ఇచ్చాం

మట్టి కట్ట కోతకు గురికావడంతో పనులు చేసిన కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చినట్లు జీడీపీ ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. ప్రాజెక్టు మట్టి కట్టకు లూజ్ మట్టిని వేయడం, సరైన పద్ధతిలో రోల్ చేయక పోవడంతో వర్షం నీటికి కట్ట కోతకు గురైందని అన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి లూజ్ మట్టిని అంతా తీయించి కొత్తగా మట్టిని వేసి రోలర్‌లో గట్టి పడేలా పనులు చేయిస్తాం. నెల రోజుల లోపు పనులు పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ తెలిపినట్లు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు.

పోలియో రహితం

- జిల్లాలో చివరి కేసు 2003లో నమోదు
- ఏటా 3.48 లక్షల మంది పిల్లలకు చుక్కల మందు
- నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

ఒకప్పుడు పోలియో అంటే భయపడేవారు. ఆ రోజులు పోయాయి. పోలియో రహిత దేశాన్ని నిర్మించాలనే లక్ష్యానికి మనం చేరుకున్నాం. ప్రపంచ వ్యాప్తంగా పోలియోపై చేసిన ప్రయోగాలు ఫలించాయి. 1968లో అమెరికాకు చెందిన శాస్త్రవేత్త జోనక్ సాల్క్ పోలియో నిర్మూలన టీకాను కనుగొన్నారు. ఇది సత్ఫలితాలు ఇచ్చింది. 1995లో మన దేశంలో పోలియో వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. దీనికి అనుగుణంగా ఏడాదికి రెండు సార్లు పోలియో చుక్కలను చిన్నారులకు వేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు ప్రజలు సహకారంతో ఒక ఉద్యమంగా పోలియో నిర్మూలన కార్యక్రమాలు జరపడంతో కర్నూలుకు పోలియో రహిత జిల్లాగా గుర్తింపు లభించింది. ఈ ఏడాది 'పోలియోను అంతం చేయండి.. ప్రతి బిడ్డ ప్రతి టీకా.. ప్రతి చోటా' అన్న నినాదాన్ని ఇచ్చింది. పోలియో నిర్మూలనా టీకాను కనుగొన్న అక్టోబరు 24న ప్రపంచ పోలియో నివారణ దినం జరుపుతున్నారు.



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 0-5 సంవత్సరాలలోపు 3.46 లక్షల మంది పిల్లలకు ఏటా పోలియో చుక్కలు వేస్తున్నారు. 2024 సంవత్సరంలో పల్స్ పోలియో కార్యక్రమాలు 100 శాతం జిల్లా ఇమ్యూనైజేషన్ శాఖ పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో సైతం 3వేలపై పోలియో శిబిరాలను ఏర్పాటు చేసి 12వేల మంది సిబ్బంది సహకారంతో చుక్కల మందును వేశారు. ఇందుకోసం పల్స్ పోలియో కోసం ఉమ్మడి జిల్లాలో రూ.45 లక్షలు 87 పీహెచ్‌సీలో ఖర్చు పెట్టేవారు. ప్రస్తుతం ఆధునికంగా పోలియో నివారణకు రోటిన్ ఇమ్యూనైజేషన్‌లో భాగంగా వారంలో ప్రతి బుధ, శనివారాల్లో సచివాలయాలు, ఆరోగ్య మందిరాలు, పీహెచ్‌సీల్లో రెగ్యులర్‌లుగా 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2003లో..

ఉమ్మడి జిల్లాలో 2003లో గూళ్యంలో ఓ బాలునికి పోలియో కేసు నమోదైంది. ఇదే చివరి కేసు. ఆ తర్వాత ఎలాంటి కేసు నమోదు కాలేదు. ఇండియాలో 2011లో చివరి పోలియో కేసు నమోదైంది. 2014 మార్చి 27న పోలియో సర్టిఫికేషన్ కమిషన్ ద్వారా భారత దేశం పోలియో రహితంగా ప్రకటించింది. అయితే మన పక్కనున్న బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో పోలియో కేసులు నమోదు కావడం వల్ల అనుమానిత జిల్లాలో కేంద్ర ప్రభుత్వం పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమాన్ని ఏటా ప్రత్యేకంగా నిర్వహిస్తుంది.



పోలియోను నివారించాం



జిల్లాలో పోలియో మహమ్మారిని నివారించగలిగాం. 2003 తర్వాత జిల్లాలో ఎలాంటి పోలియో కేసు నమోదు కాలేదు. 2024లో రెగ్యులర్‌గా వేసే పోలియో వ్యాక్సిన్‌ను వంద శాతం పూర్తి చేశాం. దీని వల్ల జిల్లాను పోలియో రహితంగా తయారు చేశాం.

– డాక్టర్ పి. ఉమ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, కర్నూలు

రాష్ట్రంలో 2008లో చివరి కేసు



రాష్ట్రంలో 2008లో పోలియో వైరస్ కేసు నమోదైంది. ఆ తర్వాత పల్స్ పోలియో కాకుండా రొటీన్ పోలియో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. పోలియో వ్యాక్సిన్‌ను పిల్లలు పుట్టిన 6 వారాలు, 10 వారాలు, 15 నుంచి 24 నెలలకొకసారి బూస్టర్, 5 సంవత్సరాల్లో బూస్టర్‌డోస్ వేయించాలి. దీంతో పాటు పోలియో వ్యాక్సిన్ తహాలోనే పోలియో ఇంజెక్షన్‌ను 6 వారాలు, 14 వారాల్లో వేయించాలి.

● డా.బి. విజయానంద బాబు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, చిన్న పిల్లల విభాగం, జీజీహెచ్, కర్నూలు

'కర్నూలు ఉత్సవ్'ను వైభవంగా నిర్వహించాలి

డీఐజీ కోయ ప్రవీణ్



డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న పత్తి ఓబులయ్య, కళాక్షేత్రం సభ్యులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఖ్యాతిని నలుదిక్కులా చాటిచెప్పేలా 'కర్నూలు ఉత్సవ్-2025'ను వైభవంగా నిర్వహించాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య, సభ్యులు మహమ్మద్‌మియా, కేవీ రమణ డీఐజీని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. టీజీవీ కళాక్షేత్రం, ఏపీ నాటక అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక భాషా వికాస సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న కర్నూలు ఉత్సవ్ వివరాలను వారు డీఐజీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఉత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ వారం రోజుల పాటూ కొనసాగే ఈ వేడుకలను జయప్రదం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. చిన్నతనం నుంచి తనకు పౌరాణిక నాటకాలు అంటే ఇష్టమని డీఐజీ గుర్తు చేసుకున్నారు. తెలుగు భాషతోపాటూ, కళారంగాన్ని భావితరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందన్నారు. జిల్లా స్థాయిలో 40 నాటక సమాజాల వారు కర్నూలు ఉత్సవ్‌లో ఏర్పాటు చేసిన పౌరాణిక ఏకాంకిక నాటక పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఉత్సవాలకు తాను హాజరావుతానని ఆయన కళాకారులకు హామీ ఇచ్చారు.

డిజిటల్ కార్డులు.. అనేక లాభాలు..!

- 60 ఏళ్లు దాటిన వృద్ధులకు అందించేందుకు కసరత్తు
- సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు
- కేంద్ర, రాష్ట్ర పథకాల్లో ప్రాధాన్యం





కర్నూలు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు అందించే డిజిటల్ కార్డులతో అనేక లాభాలు ఉన్నాయి. ఈ కార్డులను అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. 60 ఏళ్లు దాటిన వృద్ధులందరికి వీటిని అందించే కసత్తు చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఈకార్డు పొందిన వయో వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో టికెట్ రాయితీ పొందేందుకు వీలుంటుంది.

కార్డు పొందాలంటే ఇలా..

డిజిటల్ కార్డు కావాలనుకునే వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో కూడా అప్లికేషన్ అందజేయవచ్చు. దరఖాస్తు సమయంలో పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రక్తం గ్రూపు తదితర పత్రాలివ్వాలి. దరఖాస్తు చేసిన వారం, పది రోజుల్లో డిజిటల్ కార్డును పొందవచ్చు 60 ఏళ్లు దాటిన పురుషుడు, 58 ఏళ్లు దాటిన మహిళలు అర్హులు.

ప్రభుత్వ ప్రయోజనాలు ఇలా..

పిల్లల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడి వారిని ప్రయోజకులు చేసిన చాలా మంది తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు. పిల్లలు, తల్లిదండ్రుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. పాశ్చాత్య ధోరణి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో అనుబంధాల మధ్య మనస్పర్థలు, తేడాలతో విడిపోవడం లాంటి పరిస్థితుల్లో వయోవృద్ధుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వారి కోసం సీనియర్ సిటిజన్‌డిజిటల్ కార్డుల్ని అందిస్తోంది. వీటి ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు వెసులుబాటు కల్పించింది.

- డిజిటల్ కార్డుంటే ఆర్టీసీ బస్సుల్లో టికెట్‌పై 25 శాతం రాయితీ, దూర ప్రాంతాల బస్సులు మినహాయిస్తే ఇతర అన్ని బస్సు సర్వీసుల్లో రెండు సీట్లు రిజర్వు చేస్తారు.
- రైల్వేస్టేషన్లలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లు ఉంటాయి, వారికి వీల్ చైర్ సదుపాయం కల్పిస్తారు. 60 ఏళ్లు వయస్సు దాటిన వృద్ధులు, 45 ఏళ్లకు పై బడిన ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, గర్భిణులకు రిజర్వేషన్ సమయంలో లోయర్ బెర్త్‌ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పిస్తారు.
- ఈకార్డున్న వారికి న్యాయస్థానాల్లో కేసుల విచారణ సమయంలో ప్రాధాన్యం లభిస్తుంది. పాస్‌పోర్టు సేవా చార్జీల్లో 10 శాతం రాయితీ ఉంటుంది.
- 60 ఏళ్లు పైన వయస్సుంటే రూ. 3లక్షల వరకు, రూ. 80 ఎళ్లు దాటితే రూ. 5 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.
- బీమా పాలసీ తీసుకుంటే సెక్షన్80సీ ప్రకారం కింద పన్ను మినహాయింపు ఉంటుంది.

ఉల్లి ధర పతనం



చింతలచెరువులో ఉల్లిగడ్డలను సంచులకు వేసుకుంటున్న మహిళలు



గొర్రెలకు వదిలేసిన ఉల్లిగడ్డలు

- గొర్రెలకు పంట వదిలేసిన రైతులు
- సంచులతో తీసుకెళ్తున్న గ్రామస్థులు
- ఆదుకోవాలని రైతుల ఆవేదన

చాగలమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. మూడు నెలలు కష్టించి పండించిన ఉల్లిపంటకు ధర లేక రైతులు నష్టపోయారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు, కొలుములపేట గ్రామాల్లో రైతులు శ్రీనివాసరెడ్డి 1.50 ఎకరాలు, మద్దిలేటి 2 ఎకరాలు, కొలుములపేటకు చెందిన సంజీవరెడ్డి 3 ఎకరాలు, సురేష్‌రెడ్డి 2 ఎకరాలు, సహదేవరెడ్డి 2 ఎకరాలు ఉల్లి సాగు చేశారు. ధర లేకపోవడంతో ఆదివారం పొలంలోనే ఉల్లి కుప్పలను వదిలేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను నింపుకొని తీసుకెళ్లారు. మరి కొందరు రైతులు ఉల్లిగడ్డలను గొర్రెలకు మేతగా వదిలేశారు. కోత కోసిన ఉల్లిగడ్డలు వర్షానికి తడిసి దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. కేజీ ధర రూ.2 పలుకుతున్న ఉల్లిగడ్డల కోత కూలి ఎకరాకు రూ. 15 వేలు అవుతుండటంతో పంట పొలాల్లోనే వదిలేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.60 వేల దాక ఖర్చు చేశామని, 8 ఎకరాలకు రూ.4.50 లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లిగడ్డలు సాగు చేస్తే పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన చెందారు. తీరా పంట చేతికొచ్చాక ధర పతనం కావడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు పరిహారం ఇచిచ ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెద్దహుల్తి లింగేశ్వరా.. పాహిమాం..

- వైభవంగా పెద్దహుల్తి కారుమంచి, లింగేశ్వరస్వామి ఉత్సవాలు
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే బస్తిపాటి నాగరాజు, కేఈ శ్యాంబాబు



గంగపూజలో కారుమంచి,హల్తిలింగేశ్వరస్వాములు

పత్తికొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహుల్తి గ్రామంలో పెద్దహుల్తి కారుమంచి, లింగేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున బీరప్ప డోళ్లు, గొరవయ్యల వేణుగానాల నడుమ స్వామివారి ఘటాలు గంగపూజకు బయల్దేరాయి. గంగ పూజ అనంతరం స్వామివారి ఘటాలను పూజారులు తల పైఎత్తుకుని బయలుదేరారు. ఈ సమయంలో స్వామి వారి అనుగ్రహం కోసం భక్తులు రోడ్డుకు ఇరువైపులా బోర్లా పడుకుని ఎదురుచూశారు. ఘటాలను మోస్తున్న స్వాములు భక్తులను కాలితో తట్టిలేపి వారి భవిష్యత్ గురించి వివరిస్తారు. మూడురోజులపాటు గ్రామంలో జరిగే ఈ ఉత్సవాలకు స్థానికులతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతిఏడాది దీపావళి అమావాస్య తర్వాత మూడు రోజుల పాటు ఇక్కడ స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఘటాలను మోస్తున్న వారి పాదాలు తగిలితే సమస్యలు దూరమవుతాయని భక్తుల విశ్వాసం. ఇందుకోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఇదిలా ఉండగా ఉత్సవాల్లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీ నాగరాజు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి మాజీ సర్పంచ్ తిప్పన ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దహుల్తి లింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో రూ.40 లక్షల ఎంపీ నిధులతో నూతన కల్యాణమండపానికి భూమి పూజ చేశారు.



పడుకున్న భక్తులను కాలితో తడుతూ ఘటం మోస్తున్న స్వామి



హల్తిలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బస్తిపాటి, ఎమ్మెల్యే కేఈ

ముంచేశాయి

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటా మద్దతు ధర రూ.8,110 నిర్ణయించింది. మార్కెట్లో ఆ ధర కంటే తక్కువ ఉన్నప్పుడు భారత పత్తి సంస్థ (సీసీఐ) మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. సెప్టెంబరు నుంచే పత్తితీత మొదలైంది. మార్కెట్‌కు వెళితే క్వింటా రూ.4-7వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. గురువారం ఆదోని పత్తి మార్కెట్ ధరలు పరిశీలిస్తే కనిష్ఠంగా రూ.4,009, గరిష్ఠంగా రూ.7,519 పలికింది. మధ్యస్థంగా రూ.7,289 ఉంది. అంత కంటే తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇలాంటి సమయంలో అండగా నిలవాల్సిన సీసీఐ కొనుగోలు కేంద్రాలే తెరవలేదు. కఠిన నిబంధనలు పెట్టడంతో కాటన్ జిన్నింగ్ పరిశ్రమల యాజమాన్యం ముందుకు రావడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించి అన్నదాతకు అండగా నిలవాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం వ్యవసాయ శాస్త్రవేత్తలను క్షేత్రస్థాయికి పంపించి నష్టం తీవ్రతపై అధ్యయనం చేయించాలి. ఉల్లి రైతుల తరహాలో పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ల లోడింగ్ కోసం పోటాపోటీ

- నాగులదిన్నె, జోహరాపురం, ముద్దటమాగి రీచ్‌లకు టెండర్లు
- 22మంది కాంట్రాక్టర్లు షెడ్యూళ్లు దాఖలు
- 25న ఓపెన్ చేయనున్న మైనింగ్ అధికారులు



హొళగుంద మండలం వేదవతి నదిలో ఇసుక తవ్వకాలు(ఫైల్)

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర, వేదావతి నదుల్లో గుర్తించిన ఇసుక రీచ్‌ల్లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ఇసుక లోడింగ్ కాంట్రాక్ట్ కోసం మైనింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అండతో ఈ టెండర్లు దక్కించుకోవడానికి కాంట్రాక్టర్లు పైరవీలు చేశారు. సిండికేట్ బెడిసికొట్టిందో? మరే ఇతర కారణమో వారికే ఎరుక. చివరి రోజు గురువారం పోటాపోటీ మూడు రీచ్‌లకు 22మంది కాంట్రాక్టర్లు టెండరు షెడ్యూళ్లు దాఖలు చేయడం కొసమెరుపు. తుంగభద్ర నదిలో నందవరం మండలం నాగులదిన్నె రీచ్‌లో 1.20లక్షల మెట్రిక్ టన్నులు, గంగావరం-జోహాపురరం రీచ్‌లో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, వేదావతి నదిలో హొళగుంద మండలం ముద్దటమాగి రీచ్‌లో 75 వేలు మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ఈరీచ్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీల్లో లోడింగ్ చేసేందుకు ఒక్కో టన్నుకు రూ.45ల ప్రకారం వినియోగదారుడి నుంచి వసూలు చేసేలా ప్రభుత్వం ధర నిర్ణయించింది. మూడు రీచ్‌లో 3.45లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక లోడింగ్ కాంట్రాక్ట్ విలువ సుమారు రూ.1.55కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈనెల 10వ తేదీన టెండర్ నోటీస్ జారీ చేస్తే బుధవారం వరకు ఒక్క షెడ్యూల్ కూడా దాఖలు చేయలేదు. చివరి రోజు గురువారం నాగులదిన్నె రీచ్‌కు 11, గంగావరం-జొహరాపురం రీచ్‌కు ఆరు, ముద్దటమాగి రీచ్‌కు ఐదు చొప్పున 22 టెండరు షెడ్యూళ్లు దాఖలు చేశారు. ఈనెల 25న టెక్నికల్, ప్రైజ్ బిడ్ ఓపెన్ చేస్తామని గనులు భూగర్భ వనరులు (మైనింగ్) శాఖ డీడీ రవిచంద్ర 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు, లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చిన మూడు రోజుల్లోగా లోడింగ్ టెండర్ కాస్ట్ విలువపై పదిశాతం చొప్పున నాగులదిన్నె రీచ్‌కు రూ.5.10లక్షలు, గంగావరం-జొహరాపురం రీచ్‌కు రూ.6.75లక్షలు, ముద్దటమాగి రీచ్‌కు రూ.3.37 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఆ తరువాత మైనింగ్ నిబంధనలు మేరకు ఒప్పందం చేసుకొని టెండరు దక్కించుకున్న రీచ్‌ల్లో ఇసుక లోడింగ్ ప్రక్రియ చేపట్టవచ్చని అధికారులు తెలిపారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం

- వైసీపీ తీరును విమర్శించిన గౌరు చరితారెడ్డి



కల్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తున్నదని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. రాష్ట్రంలో కల్తీమద్యం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని గురువారం ఎమ్మెలే కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యం సూత్రధారులు, పాత్రధారులు వైసీపీ నాయకులే కావడం ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత వైసీపీ పాలనలో జే.బ్రాండ్ కల్తీమద్యంతో 30 లక్షల మంది అనారోగ్యం బారిన పడ్డారని, 30వేల మంది చనిపోయారని విమర్శించారు. కల్తీమద్యంపై వైసీపీ ఆరోపణలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కేఎస్ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, పెరుగు పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

- మినిట్స్ బుక్ ఇవ్వాలని ఆదేశం
- రెండు రోజుల తర్వాత రావాలన్న ఆర్‌వో



ఎంపీడీవోతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో జనార్దన్‌పై మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయిప్రసాద్‌రెడ్డి తమ అనుచర గణంతో మండల కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీపీ బడాయి దానమ్మపై వైసీపీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో ఆయన జీర్ణించుకోలేకపోయారు. అవిశ్వాస తీర్మాన సమావేశ మినిట్స్ బుక్ ఇవ్వడంటూ ఎంపీడీవోను సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. అవిశ్వాస తీర్మాన సమావేశం మినిట్స్ బుక్ ఆర్‌వో (రిటర్నింగ్ అధికారి) అజయ్‌కుమార్ పరిధిలో ఉంటుందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కాదని, మినిట్స్ బుక్ ఇవ్వడం కుదరదని ఎంపీడీవో సమాధానమిచ్చారు. సాయిప్రసాద్‌రెడ్డి ఆవేశానికి గురై వెంటనే ఆర్‌వోకు ఫోన్ చేశారు. మాకు ఇప్పుడే మినిట్స్ బుక్ కావాలని ఆర్‌వో అజయ్‌కుమార్‌ను కోరాడు. రెండు రోజుల తరువాత రావాలని, అప్పుడు ఇస్తానని ఆర్‌వో సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఇప్పుడే కావాలని పట్టుపడడంతో ఆర్‌టీఐ యాక్టుకు దరఖాస్తు చేసుకోండి అప్పుడు ఇస్తాం.. ఇప్పుడు ఇచ్చేది లేదంటూ ఎంపీడీవో చెప్పారు. చేసేదేమీ లేక వైసీపీ నాయకులు, సాయిప్రసాద్ రెడ్డి అక్కడి నుండి వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి తదితరులున్నారు.


సుబ్బరాయుడు సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగంలో రిటైర్డు ఇంజనీర్, రాయలసీమ నీటి రంగ నిపుణులు సుబ్బరాయుడు సేవలు మరువలేనివని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి, విద్యావంతుల వేదిక, జిల్లా జల సాధన సమితి సంయుక్తంగా దివంగత సుబ్బరాయుడు సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. సిద్దేశ్వరం అలుగు, వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్డీఎస్ కుడి కాలువలకు సుబ్బరాయుడు డీజైన్ చేశారనీ గుర్తు చేశారు. కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే ప్రాజెక్టుల నిర్మాణమే సాధ్యమని, సీమ ఉద్యమానికి ఆయన మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు సుబ్బరాయుడు పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి విరసం బాధ్యులు పాణి, నాయకులు రత్నం ఏసేపు, ఆదినారాయణ రెడ్డి, జగన్నాథం, రామకృష్ణారెడ్డి, సీపీఐ (ఎం) నాయకులు రాముడు, యోహాన్, డేవిడ్, సీమ కృష్ణ, సుబ్బరాయుడు కుమారుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన రైల్వే పోలీసులు



వ్యక్తిని అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

కొలిమిగుండ్ల/తాడిపత్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయిన సాయినాయక్‌ను రైల్వే పోలీసులు శివారెడ్డి, వరప్రసాద్ రక్షించారు. వారు తెలిపిన మేరకు.. కొలిమిగుండ్లకు చెందిన సాయినాయక్ ఇంటిలో గొడవ పడి, మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. ఈక్రమంలో రైలుకింద పడి చనిపోవాలని తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఓ గూడ్సు రైలు వస్తుండగా ఎదురు వెళ్లాడు. దీన్ని గమనించిన రైల్వే పోలీసులు అప్రమత్తమై అతడిని కాపాడారు. తర్వాత అతన్ని విచారించి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను పిలిపించి వారికి అప్పగించారు.

మిశ్రమ పంటలపై అవగాహన కల్పించండి

- కలెక్టర్ డా.సిరి
- వివిధ శాఖల అధికారులతో విడివిడిగా సమావేశం, టెలీ కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి, చిత్రంలో జేసీ

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిశ్రమ పంటల సాగు, ఎరువుల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో 'భూమాత రక్షణ'కు సంబంధించిన జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, భూసార పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 'భూమాత రక్షణ'ను అమలు చేస్తోందన్నారు. జేడీఏ వరలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

● అన్న క్యాంటీన్లపై గురువారం మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. టిఫిన్, భోజన నిర్వహణ గురించి ఐవీఆర్‌ఎస్ ఫీడ్‌బ్యాక్ ద్వారా ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను సేకరిస్తోందని, లోపాలు లేకుండా చూడాలన్నారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

● కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ సిరి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రహదారుల అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్, నీటి సరఫరా వ్యవస్థ, పార్కుల అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి పూర్తి వివరాలతో యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.

● జిల్లాలో ఆరోగ్యం, విద్య, వసతి నిలయాలు, మహిళా సంక్షేమం, పారిశుధ్య నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఈవో సెట్కూరు డా.కే.వేణుగోపాల్‌ను నోడల్ అధికారిగా నియమించామని, కంట్రోల్ రూమ్ సిబ్బంది ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్.1800 425 4299 ద్వారా సంప్రదించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

● ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్చరించారు. ఉదయం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్‌కు సంబంధించి లబ్దిదారులు ఇచ్చిన ఐవీఆర్‌ఎస్ సమాధానాలు సంతృప్తికరంగా లేవన్నారు. నవంబరు 5వ తేదీలోపు సర్వే నిర్వహించాలని ఆదేశించారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించండి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలని కలెక్టర్ డా.సిరి డీఎంహెచ్‌వోను ఆదేశించారు. రెండోసారి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డా.ఎల్.భాస్కర్ గురువారం రాత్రి కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డా.ఎల్.భాస్కర్ సొంత ఊరు కడప జిల్లా, రాజంపేట. వెంకటరామరాజు, బుజ్జమ్మ తల్లిదండ్రులు. 2004లో తిరుపతిలో ఎంబీబీఎస్ పూర్తి చేసి 2007లో కడప జిల్లా వనిపెంట పీహెచ్‌సీలో ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారు. 2007లో మహబూబ్‌నగర్‌లో పల్మనాలజీలో ఎండీ పూర్తి చేశారు. 2018 నుంచి 2022 వరకు కడపలో జిల్లా టీబీ ఆఫీసర్‌గా పనిచేసి, సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది కర్నూలు జిల్లా టీబీ ఆఫీసర్‌గా 2022 నుంచి పని చేస్తున్నారు.

హాస్టల్ తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఆనంద నిలయం వసతి గృహాలను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. సౌకర్యాలు ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను సూచించారు. పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, వ్యాధులు రాకుండా మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందించే స్నాక్స్‌ను రుచి చూశారు. లీగల్ సర్వీసెస్ సభ్యులు డా.రాయపాటి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్స్ సులోచన, శైలజ, రజిని తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి ఉండాలి

- డిసెంబరు 31 లోపు పూర్తిచేయాలి
- విద్యుత్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్

కల్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం పనుల్లో పరోగతి పెంచాలని, పల్లెల్లో నిరంతర త్రీఫేస్ విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, విద్యుత్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్.ప్రదీప్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం విద్యుత్‌భవన్ కన్‌స్ట్రక్షన్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ పనుల్లో భాగంగా 11కె.వి ఫీడర్స్, డీటీఆర్ ఎరక్షన్స్, స్మార్ట్ మీటర్స్, 33కె.వి ఓవర్‌లోడ్ ఫీడర్స్, లైన్స్ డిసెంబరు 31లోపు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్లలో ఎల్ఎంసీ 24-7 ఉండాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్న హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్ఈ ప్రదీప్‌కుమార్ సూచించారు.

పెళ్లి పేరిట మోసం

- గర్భం దాల్చి.. ప్రసవించిన బాలిక

పత్తికొండ/యాడికి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ బాలికను గర్భవతిని చేసిన రాజ అనే వ్యక్తిపై అనంతపురం జిల్లా యాడికి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. యూపీఎస్ సీఐ ఈరన్న తెలిపిన మేరకు, నిందితుడు పత్తికొండ పట్టణవాసి. బాధిత బాలిక యాడికి మండలంలోని ఓ గ్రామంలో పదో తరగతి వరకు చదివింది. ఆ తరువాత చదువు మానేసి కర్నూలు జిల్లా మద్దికెరలోని తన నాన్నమ్మ ఇంట్లో ఉండేది. మద్దికెరకు ఒక వివాహంలో పాల్గొనేందుకు వచ్చిన రాజ.. బాలికకు పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. దసరా పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చిన బాలిక, ఈ విషయం గురించి తెలియజేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే గర్భందాల్చిన బాలిక, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం రాత్రి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక గురువారం తెల్లవారుజామున ఆడబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలిక తల్లిదండ్రులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లి విచారించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అంగన్‌వాడీ వర్కర్, మహిళా సంరక్షణ కార్యదర్శి స్టేషన్‌కు వెళ్లారు. బాలిక అనంతపురంలో ప్రసవించినందున, అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు వారికి సూచించారు. దీంతో వారు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

డోన్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలుజారి రైలు కిందపడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన డోన్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ బింధు మాధవి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని త్రివర్ణ కాలనీకి చెందిన సతీష్ కుమార్(52) అనే వ్యక్తి గుంతకల్లు నుంచి కాచిగూడకు వెళ్తున్న రైలును మొదటి ప్లాట్‌ఫారంలో గురువారం ఉదయం ఎక్కబోయాడు. అదుపుతప్పి కాలుజారి రైలు కింద పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- సుంకేసుల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్



ఎస్ఈతో కలిసి ప్రాజెక్టును పరిశీలిస్తున్నకలెక్టర్ సిరి

కర్నూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. జిల్లాలో ప్రాజెక్టులలో నీటి నిల్వలు సాగు, తాగునీటి అవసరాలపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం సుంకేసుల బ్యారేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీ కాలువ కింద రబీ సాగునీటి అవసరాలు తీరుస్తూ వేసవిలో కర్నూలు నగరానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది తుంగభద్రకు భారీగా వరద వచ్చిందని రికార్డు స్థాయిలో 335 టీఎంసీలకు పైగా శ్రీశైలానికి విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఎస్ఈ బాల చంద్రారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఎస్ఈ బాలచంద్రారెడ్డితో పాటు కేసీ కెనాల్ సబ్ డివిజన్ డీఈఈ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

రెండో రోజు లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ పరిధిలోని ఉస్మానియా కళాశాలలో లా 3, 5వ సంవత్సరం నాల్గవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. 5వ సంవత్సరం 4వ సెమిస్టర్‌కు 73 మందికి 63, 3వ సంవత్సరం 4వ సెమిస్టర్‌కు 306 మంది దరఖాస్తు చేసుకోగా 274 మంది హాజరయ్యారని కంట్రోలర్ డా.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫిజియోథెరపీ కోసం రోగుల నరకయాతన



ఫిజియోథెరపీ కోసం వేచి చూస్తున్న రోగులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఫిజియోథెరపీ (ఓపీ.నెంబర్.41) కోసం వచ్చిన రోగులు నరకయాతన అనుభవించారు. లో ఓల్టేజీ, విద్యుత్ సమస్యలతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు యంత్రాలు పనిచేయలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు నరకయాతన అనుభవించారు.

మల్లన్న సన్నిధిలో కేంద్ర మంత్రి సావిత్రీ ఠాకూర్

- స్వామివారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి ఏవీ రెడ్డి



కేంద్రమంత్రికి చిత్రపటం ఇస్తున్న ఈవో

శ్రీశైలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారిని గురువారం కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి సావిత్రీ ఠాకూర్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఏవీ రెడ్డి వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన వీరికి ఆలయ ప్రధాన గోపురం వద్ద ఈఓ శ్రీనివాసరావు, ఏఈఓ వెంకటేశ్వర రావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకుని ప్రాకారంలోని పరివార ఆలయాలు కూడా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

రేపు డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లమా ఇన్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ (పారా మెడికల్) కోర్సులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 25న ఉదయం 10 గంటలకు కాలేజీలోని ఆడిటోరియంలో ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.ఆంజనేయులు సూచించారు. గురువారం హంద్రీనది పరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ సిబ్బందితో చాటింపు వేయించారు. హంద్రీ నదికి వరద నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున ప్రజలు, గొర్రెలు, బర్రెల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దారు సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సంపత్‌కుమార్



గూడూరు (కోడుమూరు రూరల్), అక్టోబరు 23, (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి విల్సన్ సంపత్‌కుమార్ రాష్ట్రస్థాయి హాకి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాజీర్ హుస్సేన్ తెలిపారు. 22న కర్నూలులో నిర్వహించిన అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబర చాడన్నారు. కడపలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు సంపత్ కుమార్ పాల్గొంటాడన్నారు. ఉపాధ్యాయులు భాస్కర్, రమేష్, రవికుమార్ అభినందించారు.

సంఘాల బలోపేతమే లక్ష్యం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 33 మత్స్య సహకార సంఘాల బలోపేతమే లక్ష్యమని దిశగా డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ బాబు అన్నారు. అనంతపురంలో మత్స్య సహకార సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, డిప్యూటీ రిజిస్ట్రార్ రాజారెడ్డి, కర్నూలు డీసీవో వెంకట కృష్ణ, మత్స్య శాఖ ఏడీ సంధ్యా రాణి పాల్గొన్నారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



ప్రజల నుంచి ఫిర్యాదులు వింటున్న కమిషనర్, అధికారులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధ్యామివ్వాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌లో 36 ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత విభాగాధికారులు నమోదు చేసుకుని, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇన్‌చార్జి ఎస్‌ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, ఆర్‌వో జునైద్, డీసీపీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులలో కొన్ని..

● టెలికాం నగర్‌లో రహదారులకు మరమ్మతులు చేయాలని శాంతికుమారి కోరారు. ● వీకర్ సెక్షన్ కాలనీలో పిచ్చిమొక్కలను తొలగించాలని, వీధిదీపాల సమస్యలను పరిష్కరించాలని ఉప్పర రవి విన్నవించారు. ● రాజ భోజనం హోటల్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మించాలని హేమలత సుబ్రహ్మణ్యం కోరారు. ● జయరాం నగర్‌లో సీసీ రోడ్లు వేయాలని లీలా మోహన్ కోరారు. ● ప్రకాష్ నగర్‌లో కుక్కల బెడద తగ్గించాలని స్థానికురాలు అర్షియా భాను ఫిర్యాదు చేశారు.

యార్డుకు పంట ఉత్పత్తులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు గురువారం జిల్లా నలు మూలల నుంచి రైతులు పంట ఉత్పత్తులను పెద్ద ఎత్తున తీసుకువచ్చారు. వేరుశనగ 377 క్వింటాళ్లు, ఆముదాలు 1,660, మొక్కజొన్న 452, ఉల్లిగడ్డలు 2,069 క్వింటాళ్లు తీసుకొచ్చారు. అలాగే పూల విత్తనాలు, కందులు, శనగలు, మిర్చి, సజ్జ 120 క్వింటాళ్లను రైతులు అమ్మకానికి తెచ్చారు. దీంతో మార్కెట్ యార్డులో కోలాహలం కనిపించింది. అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న, ఆల్‌ఫ్రెడ్ తనిఖీ చేశారు. అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాణ్యమైన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించాలని, లేకపోతే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రైతులు తెచ్చిన మొక్కజొన్న

జంబో ప్లాట్‌ఫాం వద్ద కాలువల నిర్మాణం



ప్రారంభమైన కాలువ నిర్మాణ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో నిర్మించిన జంబో ప్లాట్‌ఫాం వద్ద నీరు నిలుస్తుండటంతో అధికారులు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలువలు లేకపోవడంతో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు నీటి పాలవుతున్నాయని ఆంధ్రజ్యోతి దినపత్రిక కథనం ప్రచురించింది. ఇందుకు స్పందించిన మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత ప్లాట్‌ఫారం వద్ద వెంటనే కాలువలను నిర్మించాలని మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడంతో అధికారులు గురువారం ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించినట్లు డీఈ రఘునాథరెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.

9న గౌడ సంఘం వనభోజనం



కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నవంబరు 9న గౌడ సంఘం కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. గురువారం కేఈ ప్లాజాలోని కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేఈ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసాని మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కరపత్రికలను విడుదల చేశారు. నగరంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఉంటుందని, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరవుతారన్నారు. కార్యదర్శి సురేష్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు శ్యామ్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, నరేష్ గౌడ్, జన్ననేష్ గౌడ్, ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సహకరిస్తా



తైక్వాండో మార్షల్స్‌తో శమంతకమణి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల తాను ఎల్లప్పుడు సహకరిస్తానని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. గురువారం రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఆమెను స్వగృహంలో కలిశారు. ఈ నెల 25, 26 తేదీల్లో అనంతపురంలో నిర్వహిచనున్న పోటీలకు జిల్లా మార్షల్స్ కృష్ణవంశీ, విశ్వాస్‌రావుకు ట్రస్టు తరపున సాయం చేస్తానన్నారు.

మెరుగైన సేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న మేనేజర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు ఆదేశించారు. గురువారం కల్లూరు లోని 85,85 సచివాలయలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సేవ లందుతున్నాయా అని ఆరా తీశారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా అదించాల న్నారు. ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సేవల్లో జాప్యాన్ని సహించమని హెచ్చరించారు.

జీవో138 ప్రకారం వేతనాలివ్వాలి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): పారిశుధ్య సెక్యూరిటీ సిబ్బందికి జీవో. 138 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, జి.చంద్ర శేఖర్, రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. పాత కాంట్రాక్టర్ నుంచి రావలసిన 3 నెలల బకాయిలు, ఇప్పించాలని పీఎఫ్ మొత్తాన్ని పెంచాలని వారు కోరారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది తక్కువగా ఉన్నారని పూర్తి స్థాయిలో నియమించేవరకు బిల్లులు మంజూరు చేయమని తెల్పి చెప్పారు.

బెస్తలకు న్యాయం చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బెస్తలకు న్యాయం చేయాలని అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పీజీ వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అధికారంలోకి రావడానికి కృషిచేసిన బెస్తలను బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లుగా మాత్రమే అవకాశం ఇవ్వడం సమంజసం కాదన్నారు. బెస్తలు రాష్ట్రంలో 18 లక్షల మంది ఉన్నారని ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని కోరారు.

నేడు ఓపెన్ ఫోరం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రణాళిక సమస్యల తక్షణ పరిష్కారానికి శుక్రవారం 'ఓపెన్ ఫోరం' ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎస్బీఐ కాలనీలోని కౌన్సిల్ సమావేశ భవనంలో ఎల్‌ఆర్‌ఎస్, నిర్మాణ అనుమతుల సేవలలో తలెత్తుతున్న ఇబ్బందులపై పౌరులు తమ సమస్యలను తెలియజేయాలన్నారు. ఫిర్యాదులను నమోదు చేసి, తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

రోజూ చెత్త సేకరించాలి : ఎంపీడీవో



పూడిచెర్లలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న రమణయ్య

ఓర్వకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజూ చెత్తను సేకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో చెత్త సేకరణను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరువేరు చేసి కార్మికులకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సీపీఐలో చేరిక

కోడుమూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సుమారు 70 మంది సీపీఐలో గురువారం చేరారు. పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య సమక్షంలో పట్టణానికి చెందిన శ్రీరాములు, రామాంజనేయులు, మల్లయ్య, కిషోర్, మధు, గోవిందు మరికొందరు పార్టీలో చేరారు. గిడ్డయ్య మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల మేరకు కార్మిక, పేద, బడుగుబలహీన ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. శేషుకుమార్, మాధవస్వామి శ్రీరాములుగౌడ్, రంగస్వామి పాల్గొన్నారు.

దుకాణాలను తొలగించవద్దు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని అవుట్‌డోర్ స్టేడియం వద్ద తమ దుకాణాలను తొలగించవద్దని వ్యాపారులు కోరారు. గురువారం నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. తాము అక్కడే వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నామని, ఈట్ స్ట్రీట్ పేరుతో తమ దుకాణాలను తొలగించడం అన్యాయమన్నారు. వ్యాపారం చేసుకోవడానికి తమకే అవకాశమివ్వాలని కోరారు. వ్యాపారులు రఘు, మునిమోహన్, మహబూబ్‌బాషా, అలీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయరాజు కోరారు. గురువారం కర్నూలు డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికలకు వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 మంది వాలీబాల్ క్రీడాకారులు హాజరయ్యారు. కార్యదర్శి టి.కృష్ణ మహిళా కార్యదర్శి నాగేశ్వరి, ఆశాజ్యోతి, అండర్-19 కార్యదర్శి రాఘవేంద్ర, పీఈటీ సంఘం అధ్యక్షులు లక్ష్మయ్య, రవికుమార్, ఖలీల్, సురేంద్ర, శేఖర్, సుధాకర్ గోకుల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీరు ఇవ్వాలి

టీబీ బోర్డు ఎస్ఈకి రైతు సంఘం వినతి



టీబీ బోర్డు ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకుడు రామిరెడ్డి

హొళగుంద, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్ర వాటాకు వచ్చే ఎల్ఎల్‌సీ కాలువ నీరు రబీ పంటలకు సాగు నీరు, అలాగే తాగునీరు ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు తప్పెట రామిరెడ్డి కోరారు. బళ్లారిలో టీబీ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి మాట్లాడుతూ ఇప్పటికే కురుసిన అధిక వర్షాలకు ఖరీఫ్ పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. దీంతో పాటు రబీ పంటకు తుంగభద్ర బోర్డు అధికారుల ఆంధ్ర వాటాకు ఇవ్వాల్సి నీరు ఇవ్వకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణ్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్ఈ మాట్లాడుతూ నవంబరు 7వ తేదీ తుంగభద్ర బోర్డు అధికారుల సమావేశంలో రబీ పంటకు ఆంధ్రకు సాగు, తాగునీరు అందించే విషయంపై బోర్డు ఉన్నత అధికారులతో చర్చలు జరిపి ఓ నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక రైతు సంఘం నాయకులు శరణ గౌడ, రైతులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్ హాల్‌లో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఈడీ కళాశాలలో తరగతులు నిర్వహించకుండానే వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకుడు రవి అర్జున్, నగేష్, పవన్, జయరాజ్ పాల్గొన్నారు.

ధ్యానంతో మనోధైర్యం

● ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి
● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి మనోధైర్యాన్ని పెంచుకోవడంతో తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని బోడిబండ ఫక్కీరప్ప స్వామి ఆలయ సన్నిధానంలో దాత సింగంశెట్టి గురునాథ్ రూ.65లక్షలతో నిర్మించిన కోదండరామస్వామి ధ్యాన మందిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కాసేపు ధ్యానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ధ్యానకేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సింగంశెట్టి గురునాథ్ కుటుంబాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి ధ్యానం మందిరానికి వచ్చి ధ్యానం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు అప్పా వేణుగోపాల్, టీడీపీ నాయకులు బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులుగౌడు, తిరుపాల్ నాయుడు, మిద్దె వెంకటేశ్ యాదవ్, బాలన్న, వెంకట్రాముడు చౌదరి, శ్రీరాములు చౌదరి, మనోహర్, రాము నాయక్, విశ్వనాథ్, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

9న కార్తీక వనభోజనాలు

పత్తికొండ: కర్నూలు ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 9న కార్తీకవన భోజనాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సంఘం వర్కింగ్‌ప్రసిడెంట్ మహేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సురేష్‌గౌడ్, వెల్దుర్థి మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, అమర్నాథ్‌గౌడ్ మాట్లాడుతూ కర్నూలు నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక వన భోజనాలను నిర్వహిస్తున్నామన్నారు. మాజీమంత్రి కేఈ ప్రభా కర్, శివసాయిబాబాలు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు శ్యాంగౌడ్, రాజశేఖరగౌడ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఈడిగ సంఘం నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో వెలిసిన ఉచ్చీరప్ప తాత దేవాలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని విస్మరించడంతో వైసీపీకి ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారుకొండ శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్, సర్పంచ్ వీరేష్, నాయకులు కమ్మ జయప్రకాష్, చిన్నహోతూరు కొంక మధు, కళ్యాణ్‌బాబు, ఎంపీటీసీ చిన్నయాదవ్, కమ్మ రమేష్‌బాబు, చిన్నరాముడు, రాజు, ఉమాపతి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

ఆలూరు: పార్టీ కోసం సేవలు అందించే వారిని అధిష్ఠానం గుర్తిస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. గురువారం రాష్ట్ర బెస్త సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన రామాంజనేయులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కోసం పని చేసే వారిని గుర్తించి నామినేట్ పదవుల్లో అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ తాలూకా నాయకులు బి.టి.రాజు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

వెల్దుర్తిలో సినిమా షూటింగ్



షూటింగ్‌లో పాల్గొన్న సినీ నటులు

వెల్దుర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. జబర్దస్త్ అప్పారావు, సునీత ప్రధాన పాత్రధారులుగా 'ఉంటే ఇలాగే ఉండాలి' సినిమాను తెరకెక్కిస్తున్నారు. వెల్దుర్తిలో ఉన్న గౌరీ థియేటర్, చెరుకులపాడు రోడ్డులో ఉన్న రైస్‌మిల్లు, వీరన్నగట్టు పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశారు. సినిమా షూటింగ్‌ను చూసేందుకు, ఫొటోలు దిగేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్టర్ రోబో సుధాకర్ మాట్లాడుతూ సినిమా షూటింగ్ చివరి షెడ్యూల్‌కు చేరుకుందని తెలిపారు. డైలాగులు దివాన్ వలి రాసినట్లు వెల్లడించారు. సినీ నటులు షేకింగ్ శేషు, గడ్డం నవీన్, రన్నింగ్ రాజా, ఇలియాజ్‌బాషా పాల్గొన్నారు.

ఆలూరులో భారీ వర్షం



ఆలూరులో మోడల్ స్కూల్ ముందు నిలిచిన వర్షపు నీరు

ఆలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దాంతో అరికెర రోడ్డు జలమయమైంది. కాలువలు పొంగి ప్రవహించాయి. ఉరుకుంద ఈరన్న కొట్టాల కాలనీ, గుంతకల్ రోడ్డులోని సినిమా థియేటర్ వెనుక ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. మోడల్ స్కూల్ ముందు భారీగా వర్షం నీరు నిలువడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికు మార్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. మండలానికి చెందిన పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను, ఉత్తమ అవార్డు గ్రహీతలను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడితో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న, జిల్లా కార్యదర్శి భీమారెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రఘు రామయ్య, మండల విద్యాశాఖ అధికారులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు హాజరై వారిని సన్మానించారు. వారు మాట్లాడుతూ యాప్‌లతో బోధనకు ఆటం కం కలుగుతుందని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యా యులకు విము క్తి కలిగించాలని కోరారు. 67 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై ప్రైవేటీకరణను ప్రజలంతా ఐక్యతతో అడ్డుకుందామని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. వైసీసీ రాష్ట్ర కమిటీ పిలుపుతో గురువారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం పూనుకుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, కౌన్సిలర్లు చలపతి, మధు పట్టణ అధ్యక్షుడు దేవా పాల్గొన్నారు.

నగదు చోరీ

ఆస్పరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్టేకల్ గ్రామంలో బత్తిని కురువ రాజేంద్ర ఇంట్లో రూ.40 వేలు చోరీకి గురైనట్లు బాధితుడు గురువారం తెలిపారు. ఉదయం తన ఇంటికి తాళం వేసుకుని పొలానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో వచ్చి చూడగా బీరువాను పగలగొట్టి నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు

ఆదోని టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోవా) ఆధ్వర్యంలో నోబుల్ ఒకేషనల్ కళాశాలలో క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల సందర్భంగా గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పారా మెడికల్ విద్యార్థులకు డా.మిథిలేష్ కుమార్, డాక్టర్ శివరాజ్ క్యాన్సర్ వ్యాధికి కారణాలు, వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాల గురించి వివరించారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇచ్చారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మద్దికెర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోమీన్ వీధి, నేషే వీధి, రామస్వామి గుడి ప్రాంతాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అబ్దుల్ ఖాద్ అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' 'కలుషిత నీరు సరఫరా' అనే కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు ఆ ప్రాంతాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. అలాగే ఆ ప్రాంత ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు జల్‌జీవన్ మిషన్ కింద ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయిందని, అందులో బుగ్గ వాటర్ స్కీం ద్వారా నీరు వదిలి ఈ ప్రాంత ప్రజలకు అందించాలని తెలిపారు. పంచాయతీ వారు వేసిన పైపులైన్‌కు కూడా లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. 15 రోజులకు ఒకసారి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మంచినీరు అందించేందుకు తాత్కాలిక ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. ప్రజలకు మంచినీరు శాశ్వత పరిష్కార దిశగా పని చేస్తామన్నారు. నీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మహబూబ్ ఖాన్, జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఆంజనేయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వెల్దుర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో కలకలం సృష్టించిన హత్య కేసులో పోలీసులు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. బుధవారం వెల్దుర్తి ఐజీనగర్‌లో వివాహిత షేక్ ఉజ్మా (35) దారుణహత్యకు గురైన ఘటనలో మున్నా అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు మృతురాలి తల్లి షేక్.నూర్జహాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మధుసూదనరావు, ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గురువారం హత్య జరిగిన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులు, సమీపవాసులతో వివరాలు సేకరించారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని, త్వరలో కేసును ఛేదిస్తామన్నారు. కాగా, ఉజ్మా భౌతికకాయాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ముస్లింశ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

జూనియర్ లైన్‌మన్‌కు గాయాలు

చిప్పగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం బెల్డోన గ్రామంలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న లింగన్న విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. నేమకల్ గ్రామానికి చెందిన లింగన్నకు ఇటీవలే వివాహం జరిగింది. ఎప్పటిలాగానే విధులకు వెళ్లాడు. విద్యుత్ సమస్య తలెత్తడంతో స్వయంగా విద్యుత్ స్తంభం ఎక్కాడు. అదే సమయంలోనే షాక్ తగిలి పైనుంచి కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో చేతులు కాలిపోయాయి. అయితే ప్రమాదంపై అధికారులు, సిబ్బంది పెద్దగా పట్టించుకోలేదని భార్య హారిక వాపోయారు. ప్రమాద ఘటనపై విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు.

రహదారికి మరమ్మతులు

ఆలూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో బురద వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయమై సర్పంచులు, టీడీపీ కార్యకర్తలు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆము గురువారం రైల్వే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. యుద్ధ ప్రాతిపదికన రహదారికి మరమ్మతులు చేపట్టారు.

నూతన ఉపాధ్యాయులకు ఐడీలు ఇవ్వాలి

పత్తికొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయులకు జీతభత్యాలు ఆలస్యం కాకుండా ప్రభుత్వం వెంటనే పొజిషన్ ఐడీలు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కొత్తపల్లి సత్య నారాయణ, జిల్లానాయకులు రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, బలరాం డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండలో ఉపాధ్యాయులకు నూతన సభ్యత్వ పత్రాలను వారు పంపిణీ చేశారు.

చంద్రబాబుకు ప్రజలు గుణపాఠం చెబుతారు

హాలహర్వి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అబద్ధాల హామీలతో గద్దెనెక్కి మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధపడ్డ సీఎం చంద్రబాబునాయుడుకు ప్రజలు గుణపాఠం చెబుతారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. హాలహర్వి, బాపురం, గూళ్య గ్రామాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా గురువారం కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికార పార్టీ పీఠం దక్కించుకున్నారన్నారు.

వైసీపీలో చేరిక: మండలంలోని బాపురం గ్రామానికి టీడీపీకి చెందిన 10 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీకి చెందిన గూళ్య చంద్రశేఖర్, బసిరెడ్డి, ఉమేష్, సుగనగౌడ్ తదితరులు ఎమ్మెల్యే విరుపాక్షి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలకు సహకరించాలి

మద్దికెర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దమ్మకుంట సమీపంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో నవంబరులో జరిగే సుబ్రహ్మణ్యస్వామి షష్టి ఉత్సవాలకు సహకరించాలని నిర్వాహకుడు ఎస్.విజయప్రసాద్ యాదవ్ కోరారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, ఎం.అగ్రహారం సర్పంచ్ బురుజుల విజయుడు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి శేషవస్త్రాన్ని, మెమెంటోను, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పులికొండ, తిప్పేస్వామి, సూరి, తదితరులు ఉన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ మృతి

చిప్పగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరడోణ గ్రామానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ అంపయ్య(42) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఆస్పరిలో విధులు నిర్వహించే వారు. హైబీపీతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉపాధి హామీ పథకం సిబ్బంది, అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, తాలూ కా అధ్యక్షులు కత్తి రామాంజనేయులు, చాకిబండ సూరి, ఆలూరు చంద్ర నగరడోణ గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం కర్నూలులో మూడు రోజులుగా జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14,17,19 విభాగాల్లో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఎస్ఎస్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో గురువారం పాఠశాలలో విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ముల్లా మాబు అండర్-19 విభాగంలో, ఎనిమిదో తరగతి విద్యార్థిని షర్మిల అండర్ 17 విభాగంలో, అండర్ 14 విభాగంలో తులసి నీహారిక, మోహన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పీఈటీ ఉపాధ్యాయులు వెంకటేష్, బసవరాజు సృజన కుమారిని హెచ్ఎం అభినందించారు. ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, కరేకృష్ణ, సత్యనారాయణ, లోకేశ్, మాణిక్యమ్మ, తిమ్మప్ప, ఖాజా పాల్గొన్నారు.

● కె.తిమ్మాపురం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రఫీ తెలిపారు. కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ హాకీ పోటీల్లో పాఠశాలకు చెందిన ఈ వెంకటేష్, రూపా అండర్ 17 విభాగంలో, అండర్ 14 విభాగంలో కవిత, రామలక్ష్మి, కె.వీరేంద్ర హాకీలో అత్యుత్తమ ప్రతిభకనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్ఎం రఫిక్, పీడీ ఈరన్న గౌడ్, ఉపాధ్యాయులు భాగ్యరాజు, నరసింహులు, శంకర్‌రెడ్డి, మల్లికార్జున, మంజుల, శ్యామల అభినందించారు.

మంత్రాలయం: మండలంలోని విద్యానగర్ ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం రామాంజనేయులు, లక్ష్మీకాంత్ తెలిపారు. గురువారం పరమాన్‌దొడ్డి తండా గ్రామంలో ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శ్రీవాణిబాయి అండర్-17లో బాస్కెట్‌బాల్, వాసంతి హాకీలో, అండర్-14 విభాగంలో బాస్కెట్‌బాల్‌లో విశేష ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కవిరాజు, జగదీష్, వీరేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యానికి ఆస్కారం ఉండదు'



మాట్లాడుతున్న రమాకాంతరెడ్డి

పెద్దకడబూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యానికి ఆస్కారం ఉండదని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. గురువారం పెద్దకడబూరులోని మద్యం దుకాణం ముందు మద్యం కొనుగోలు చేసే వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కానర్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మద్యం ప్రియులు కల్తీ మద్యాన్ని తాగి అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోయాని, దీన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు నాయుడు ఎక్కడా కల్తీ మద్యం విక్రయించకుండ జాగ్రత్తలు తీసుకుంటున్నారని అన్నారు. కల్తీమద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ ఆంజనేయులు, నరసింహులు, మానప్ప, నాగేష్, ఖాజా, ముక్కరన్న పాల్గొన్నారు.

వేతనాల పెంపు కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాల పెంపు కోసం కార్మిక వర్గం ఉద్యమించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. కార్మిక వర్గం ఎటువంటి కనీస వేతనాలు, గ్రాట్యుటీ, రెగ్యులర్ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక శ్రమ దోపిడీ చేస్తున్నార న్నారు. స్వాతంత్ర్యం కంటే ముందు సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయడం దారుణమన్నారు. ఈ నెల 25,26 తేదీల్లో జరిగే 13వ జిల్లా మహా సభలను కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రవీణ్, నాగరాజు, ఇస్మాయిల్, లతారాణి, సుధాకర్ తదిరులు పాల్గొన్నారు.

'కుటుంబ సభ్యులకే ఉద్యోగాలు ఇవ్వాలి'



వినతి పత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో పనిచేస్తూ మరణించిన, పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలోని వారికే ఉద్యోగాలు ఇవ్వాని ఏఐటీయూసీ నాయకులు యల్లప్ప, విజయేంద్ర, నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మిక సంఘం యూనియన్ నాయకులు శివ, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగులకు 12శాతం పీఆర్‌సీని ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. పట్టణ విస్తీర్ణాన్ని బట్టి కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఖాజా, నరసింహులు, భీముడు, వీరేష్, నరేష్, యోహాన్‌లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● అకడమిక్ మానిటరింగ్ అధికారి సలీం బాషా



కోసిగి మోడల్ స్కూల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి సలీం బాషా

కోసిగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్‌లో, జూనియర్ కాలేజీలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్.సలీం బాషా, జీసీడీవో స్నేహలత అన్నారు. గురువారం కోసిగిలోని మోడల్ స్కూల్‌లో రికార్డులను పరిశీలించి విద్యార్థుల తరగతి గదులను, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి తరగతిలో విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు గుర్తించి వారిపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. అలాగే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు మెలకువలు విద్యార్థులకు తెలియజేశారు. అలాగే 10వ తరగతి విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుందర్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కృషి చేయాలని జీసీడీవో స్నేహలత సూచించారు. కోసిగిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ షబానా అజ్మీన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉండాలి'

మంత్రాలయం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యాబోధన సాగాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి సలీంబాషా, జీసీడీవో స్నేహలత అన్నారు. గురువారం మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి మోడల్ పాఠశాలను ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారిహాజరు, విద్యాబోధన, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, నళని, సోమలింగం, షరీఫ్‌వళి, వైష్ణవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రాయచోటి గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలి'

నందవరం అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయచోటి గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు రామకృష్ణారెడ్డి, రమేష్, ఆనంద్, మల్లన్న, దస్తగిరి, వీరేష్, రంగయ్య, నాగేష్, ఇమ్మానియేల్, మికయేల్ కోరారు. నందవరంలో గురువారం ఎంపీడీవోను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాటాడుతూ గత కొన్నేళ్లుగా తమ గ్రామం రాయచోటి పక్క గ్రామమైన గురుజాల మజరా గ్రామాంగా ఉందని, దీంతో గ్రామాభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. గ్రామపంచాయతీకి మంజూరైన నిధులు గురుజాలలోనే వెచ్చిస్తుండటంతో మా గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. అంతేగాక ఎన్నికల సమయంలోనూ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా గ్రామప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాయచోటి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతిగా చేయాలని తీర్మానించుకున్నట్లు తెలిపారు.

ముగిసిన శిక్షణ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పేదరికంలేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తొమ్మిది రకాల అంశాలతో పట్టణంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమ గురువారం ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమానికి పెద్దకడబూరు, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. డిప్యూటీ ఎంపీడీవో సందీప్ మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని పేదరికంలేని, మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే ఆరోగ్యకరమైన గ్రామంతో పాటు, పిల్లలతో స్నేహపూర్వకరమైన గ్రామం, నీటి సమృద్ధి గ్రామం, పరిశుభ్రమైన హరిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి ఒక్కరు క్రిమి సమృద్ధితో పాటు మౌలిక సదుపాయలు కలిగిన, సామాజిక న్యాయం, భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, మహిళా స్నేహపూర్వకమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలన్నారు. ఎమ్మిగనూరు ఎంపీపీ కేశన్న యాదవ్, ఎంపీడీవో బంగారమ్మ, టీవోలు సుభాన్, రమ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో కార్తీక శోభ



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

మంత్రాలయం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం కార్తీకమాస తదియ శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణభోద పూజ మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథం పై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మంగళహారతులతో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలోని యాగశాలలో బెంగళూరుకు చెందిన నృత్యదిశ ట్రస్టు ఆర్గనైజర్ డా.దర్శిని మంజునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం అలరించింది. గురువారం యాగశాలలో సంప్రదాయ భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కళాకారులకు నగదు, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు సురేష్‌కోణాపూర్, వెంకటేష్‌జోషి, ఐపీ నరసింహమూర్తి, డీఎం ఆనందరావు, అనంతపురాణిక్, జేపీస్వామి, పద్మనాభాచార్, హనుమేష్‌ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాశ్‌ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభం ఏర్పాటు చేశారు.. వీధిలైట్ మరిచారు



వీధిలైటు ఏర్పాటు చేయని స్తంభం

ఎమ్మిగనూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో నాగప్పల కట్టల లైన్ నాలుగో వీధిలో మున్సిపల్ అధికారులు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. అయితే వీధిలైట్‌ను తగిలించటం మరిచారు. దీంతో ఆ వీధివాసులు చీకట్లో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. స్థానికంగా గతంలో ఉన్న విద్యుత్ స్తంభం ఇంటికి అడ్డంగా ఉండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ అధికారులు స్తంభాన్ని పక్కనే మరోచోట ఏర్పాటు చేశారు. విద్యుత్ స్థంబం ఏర్పాటు చేసి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా స్తంభానికి వీధిలైట్ వేయకుండా వదిలేశారు. స్తంభానికి వీది లైటు ఏర్పాటు చేయాలని స్థానికులు అటు మున్సిపాలిటీలోను, ఇటు సచివాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు, సిబ్బంది కాని ఏమాత్రం స్పందించకపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. తావిస్తోంది. వీదిలైట్ ఏర్పాటు చేయకపోవటం వల్ల ప్రజలు చీకటిలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్థంబానికి వీదిదీపం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో ప్రతి గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తామని ఈవోపీఆర్డీ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'తాగునీటికి కటకట" కథనానికి స్పందించారు. ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో తాగునీటి కుళాయి పైపులైన్ పనులు జరుగుతున్నాయని దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడిందని, మిగతా గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

నందవరం అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులకు కృషి చేయాలని ఎంపీపీ లక్ష్మీదేవి కోరారు. నందవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పులయ్య ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ ముగతి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ రహదారులు పూర్తిగా అధ్వానంగా తయారయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జగ్గాపురం ఎంపీటీసీ అనుమంతమ్మ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బంది తీవ్రంగా ఉందని, సమస్యను సరిష్కరించాలని కోరారు. నాగలదిన్నెలో పలు సమస్యలను ఎంపీటీసీ అతావుల్లా, కో ఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు శశిశేఖర్, ఏఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకడబూరు , అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగల్ విండో చైర్మన్ మీసేవ ఆంజినేయులు, సొసైటీ సంఘం కార్యదర్శి మురళి రెడ్డి అన్నారు. గురువారం పెద్దకడబూరులోని సొసైటీ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు సవంత్సరానికి ప్రీమియం రూ.20 చెల్లిస్తే పీఎంఎస్‌బీవై కింద ప్రమాదవ శాత్తు, అంగవైకల్యం జరిగితే రూ.2 లక్షల వరకు బీమా ఉంటుందని తెలిపారు. పాక్షిక వైకల్యం జరిగితే రూ. లక్ష బీమా వస్తుందని చెప్పారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈశాన్య రుతుపవనాల కారణంగా భారీ వర్షాల కురియనున్నాయని వాతవరణ శాఖ ప్రకటించిందని, ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం 376.70 మీటర్లు ఉండడంతో జీడీపీ అధికారులు హంద్రీనదికి నీటి విడుదల చేస్తున్నారని, పరివాహక గ్రామాలైన గాజులదిన్నె, ఐరన్‌బండ, నేరుడుప్పల, పిల్లిగుండ్ల, లింగందిన్నె, గంజహళ్లి, హెచ్ కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, మహిళలు, పిల్లలు నీటి పరివాహక ప్రాంతాలకు వెళవద్దని సూచించారు. సొలాలకువెళ్ల రాదని, నానిన మట్టి మిద్దేలలో నివాసం ఉండవద్దని, మహిళలు హంద్రీనదిలో దుస్తులు ఉతికేందుకు, పిల్లలు ఈతకు వెళ్లవద్దని సూచించారు.

నష్ట పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

గోనెగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న ఆయకట్ట భూములలో నీరు చేరి సాగు చేసిన పంటలు దెబ్బ తిన్నాయని, ఆ పంటలకు ప్రభుత్వం సర్వేలు జరిపి వెంటనే రైతులకు పరిహారం అందజేయలని ఐరన్ బండ గ్రామ రైతులు పాండురంగడు, పెద్దరంగస్వామి, రామనాయుడు, పాపారావు కోరారు. గురువారం తహసీల్దార్ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ గత నెల 23వ తేది నుంచి నేటి వరకు దాదాపు 50 రోజులుగా సాగు చేసిన పంటలు నీటిలో మునిగి పోయాయని ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉండే ఆయకట్టు పొలాలో సాగు చేసిన పంటలు వేరుశనగ, ఉల్లి, మిరప, మొక్కజొన్న, వరి, సజ్జ పంటలు 150 ఎకరాలలో పంటనష్టం వాటిల్లింది. అధికారులు సర్వేలు జరిపి పంట నష్టపోయిన రైతులకు పరిహారం కింద ఎకరాకు లక్ష రూపాయల మేర పరిహారం ఇవ్వాలని కోరారు. 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా.. తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ప్రాజెక్టు కట్ట ఎత్తుపెంచి ఇప్పుడు నిల్వ చేసే 4.5 టీఎంసీలకు అదనంగా మరో 1టీఎంసీ నీటిని నిలువ చేస్తే 300 ఎకరాల మేర పంట భూములు నీట మునుగుతాయాన్నారు. కావున అధికారులు సర్వేలు జరిపి పంటభూమి నష్టపోయిన రైతులకు ఒక ఎకరంకు రూ. 40లక్షలు పరిహారం ఇవ్వాలని ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రాజేశ్వరి మాట్లాడుతూ విషయంను ఉన్నతాధికారులక తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌలుట్లమ్మ, రామలక్ష్మి, రంగస్వామి, రవి, ఈశ్వరరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం

● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



సురేష్ నాయుడును అభినందిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విజయానికి కష్టపడిన ప్రతికార్యకర్తకు న్యాయం చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. టీడీపీ కౌతాళం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్‌నాయుడు, కమిటీ సభ్యులను గురువారం రాఘవేంద్రరుడ్డి మాధవరం తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యక్షుడిగా వీరేష్, ప్రధాన కార్యదర్శిగా పట్టాభి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సబవరాజు, నాగేంద్రరెడ్డి, నాగిరెడ్డి, కార్యదర్శిగా సన్నప్ప, మాలిక్ బాషా, ఈరన్న, కోశాధికారిగా రామన్నగౌడు ఎంపిక కావడంతో అభినందించారు. అనంతరం రాఘవేంద్ర రెడ్డితో పాటు మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, యువ నాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డిని కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వెంకటపతిరాజు, మారెప్ప, సతీష్‌నాయుడు, అడివప్పగౌడు, రాజానంద, రామలింగ, గోవిందు, ఈరన్న, గిరి, బసవరాజు, మూకన్న పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

● వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి బుట్టా రేణుక



మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకణ చేయడం తక్షణమే ఆపాలని వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి బుట్టా రేణుక డిమాండ్ చేశారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని వైసీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పుస్తకాలు విడుదల సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని వైద్య, విద్య రంగం ప్రైవేట్ పరం చేయాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం పీ4 విధానంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తోందన్నారు. వైఎస్ జగన్ 17 మెడికల్ కళాశాలలో 5 మెడికల్ కళాశాలలను ప్రారంభించి వైద్య విద్య, వైద్యం సామాన్యులకు చేరేలా చేస్తే, కూటమి ప్రభుత్వం పేదల ప్రజలకు వాటిని అందకుండా ప్రైవేట్ వ్యవస్థలకు అప్పజెప్పడం దారుణమన్నారు. ఈ దారుణాన్ని రచ్చబండ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలల వల్ల యువతకు లభించే అవకాశాలు, వైద్య సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రజలతో సంతకాల సేకరణ చేస్తే గవర్నర్‌కు వైఎస్ జగన్ అందజేస్తారని చెప్పారు. వైసీపీ నాయకులు నీలకంఠప్ప, బషీరెడ్డి, మురహరి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, నరసింహులు, విరూపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


మంత్రాలయం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్, ప్రధాన రహదారులు మంత్రాలయం సమీపంలో అభయ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గురువారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహరాష్ట్ర నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, మోటారుసైకిళ్ల ఆపి ప్రయాణికుల సంచులను తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నియంత్రణ ఉల్లంగించిన వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. అదేవిధంగా డ్రంక్‌డ్రైవ్‌లో భాగంగా మద్యంతాగి నడిపే వారిపై తనిఖీ చేసినట్లు తెలిపారు. మంత్రాలయంలో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

పారిశుధ్య పనులు

కౌతాళం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని పంచాయతీ పారిశుధ్య కార్మికులు పేరుకుపోయిన చెత్త తొలగింపులో గురువారం మనిపోయారు. కౌతాళంలోని ప్రధాన వీధుల్లో అనగా జేకేఎల్ఎస్ దర్గా నుంచి అత్తార్ వీధి, మెయిన్ బస్టాండ్‌లో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ అధికారులు తమ సిబ్బంది చేత ట్రాక్టర్ ద్వారా చెత్తను తీసివేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలోని డ్రైనేజీలను ఎప్పటిక వ్పుడు శుభ్రంగా ఉంచుతామని పంచాయతీ కార్యదర్శి ప్రకాశం, సర్పంచ్ పాల్‌దినకరన్ తెలిపారు. ప్రజలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రహదారి అధ్వానం

● ఇబ్బందులు పడుతున్నప్రజలు



గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్ రోడ్డు దగ్గర గుంతలు పడిన పిల్లిగుండ్ల, నెరుడుప్పల రహదారి

గోనెగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంంలోని గాజులదిన్నె క్రాస్ రోడ్డు నుంచి పిల్లిగుండ్ల, నెరుడుప్ప, ఒంటేడుదిన్నె, గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారిపోయింది. వర్షాలు కురియడంతో గుంతు మరింత పెద్దవయ్యాయి. గుంతలు మోడల్ స్కూల్ సమీపంలో ఉండటంతో విద్యార్థులు ద్విచక్రవాహనాలపై వచ్చేవారికి ఇబ్బందిగా మారింది. మరి సైకిల్‌పై వచ్చే విద్యార్థులు గుంతలలో పడి గాయాల పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వార్షల కారణంగా గుంతలలో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట ద్విచక్రవాహన దారులు, ఆటోలు గుంతలలో పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇదే రహదారి వెంట గోనెగండ్ల నుంచి పిల్లిగుండ్ల, నెరుడుప్పల, బండగట్టు, కప్పట్రాళ్ల క్రాస్ రోడు నుంచి పత్తికొండకు అలాగే ఎర్రబాడు మీదుగా ఈదులదేవర బండ, కోడుమూర కు గ్రామాలకు బస్సులు, ఆటోలు వెళ్తుంటాయి. రహదారిని బాగుచేయాలని పలు మార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. రహదారి మొత్తం గుంతపడి పోవడం తో ద్విచక్ర వాహనాలను, ఆటోల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, విద్యార్థులు ఇబ్బందులు పడున్నా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.